# 'మంచిచెడూ'

మంచి చెడులనేవి సాపేక్షాలు...

మనకు మంచిదైంది యింకోళ్లకి చెడుకావచ్చు. సహ్యాసహ్యాలూ అలాగే కదా.

మాంసం తినేవాళ్లన్చూసి 'యాక్కు' అనేవాళ్లని చాలామందిని చూస్తూంటాం. లొట్టలేసుకుని మాంసం తినేవాళ్లనీ చూస్తాం.

మంచి వెనక చెడూ చెడు వెనక మంచీ వుంటాయి.

ఎవడినైనా చూపించి వాడు మంచివాడూ వాడు చెడ్డవాడూ అనెలా అనగల్గుతాం?

వాడితో అవసరం పడ్డప్పుడే.

వాడితో మీకు జీవితంలో అవసరం పళ్లేదనుకోండి. ఎవరైనా వచ్చి "చూడూ ఆయినెలాంటి మనిషీ?" అనడిగితే మీ నోట్నించి వచ్చే సమాధానం "అబ్బే ఆయన గురించి నాకేమీ తెలీదండీ" అనంటారు.

లేదూ ఆ సదురు వ్యక్తితో మీకవసరం పడి ఆ అవసరం తీరిందనుకోండి. అప్పుడు మీ సమాధానం "ఆయనా చాలాచాలా మంచివాడండీ...నేను చాలా ఇబ్బందుల్లో వుండి వెళితే నా బాధను తన బాధగా చూసుకొని మరీ సాయం చేశాడండీ... బహు ఉత్తముడాయన" అనొస్తుంది. అవసరం తీరలేదనుకోండి "వాడా దొంగముండా కొడుకండీ పిల్లికి బిచ్చం వెయ్యడు - పక్కింటివాడే కదా అని చిన్న సాయిమండీ... చాలా చిన్నపనే అడిగితే వెధవ ఫోజు పెట్టి... "యింకా యింకా రకరకాలుగా వస్తుంది సమాధానం.

నేనూ భట్టూ సైకిళ్ల మీద దక్షిణభారత యాత్ర చేస్తున్నప్పుడు రకరకాల వ్యక్తులు తగిలారు. రకరకాల అనుభవాలు.

ఉడిపి నుంచీ ధర్మస్థలం. రూట్ వేణూరు, కార్కళ మీదుగా డిసైడ్ చేసుకున్నాం. పడమటి కనుమలు... దట్టమైన అరణ్యం...భట్టు నాకన్నా శారీరకంగా దృఢమైనవాడు. నేను సిగరెట్టు యింకో యింకో అలవాటు వల్ల అలుపు త్వరగా వచ్చేస్తుంది. ధర్మస్థల యింకో పద్దెనిమిది కిలోమీటర్లుండుగా కొండ ఎక్కుతున్నాం. విపరీతంగా వర్షం... కొండ పైకెక్కేసరికి నా పనైపోయింది.

వాన వెలిసింది. సూర్యాస్తమయం అవుతోంది. కాస్త ఆకలి కూడా అనిపించింది. రోడ్డు వారగా చిన్న కల్వర్ట్ మీద కూలబడ్డాం, నేనూ భట్టూ. మా కెదురుగా కొంతమంది

కూలీలు. ఆ కొండ కోనల్లో విద్యుద్దీపాలకి స్థంభాలు వేస్తున్నారు. ఆ రోజుకి పనైపోయినట్టుంది... అడవిలోని పనస చెట్టు నిండా మాగీ మాగని పనసపండు తెచ్చి పగల గొట్టి తింటున్నారు. (గుమ్మడికాయ పగుల గొట్టినట్లు... చిన్నప్పుడు మా అమ్మ బూడిద గుమ్మడి కాయ గానీ తీయ గుమ్మడికాయగానీ నా చేత పగల గొట్టించే దృశ్యం గుర్తొచ్చింది.) రోడ్డు కిటువేపునున్న మా దగ్గరకొచ్చి నాకూ భట్టూకూ పనసాకునిండా ఓ పది పనసతొనలు ఇచ్చి ఓ మహాద్భుతమైన నువ్వు నవ్వి వెళ్లాడు వాళ్లలో ఓ వ్యక్తి. కమ్మటి వాసనల ఆ పనసతొనలు తిని మళ్లీ బయల్దేరాం. చీకటి పడిపోయింది. ఆ రోడ్డు మీద హెవీ ట్రాఫిక్ రద్దు... కార్లూ, జీపులూ, మినీ బస్సులూ తిరుగుతాయంటే... త్వరగా ధర్మస్థలం చేరుకోవాలి. వేగంగా తొక్కుతున్నాం సైకిళ్లు.

మళ్లీ ఓ మిట్ట ఎక్కాల్సొచ్చింది. ఆయాసపడుతూ తొక్కుతున్నాం. మావి మామూలు అట్లాస్ సైకిళ్లు. మళ్లీ వాన మొదలైంది. చీకటి చినుకులకు రెప్పలు తీయడం ఇబ్బంది. పైగా మిట్ట... పైకి లేచి తొక్కుతున్నాను. పెడల్ మీంచీ కుడికాలు జారింది. బార్‌పై పడ్డాను. ప్రాణం పోయే నెప్పి... (మగవాళ్లకు అర్థమౌతుంది.)

ఇక సైకిల్ తొక్కడం నావల్ల కాదని తేల్చేసాను.

కీకారణ్యం..హోరున వాన.. ధర్మస్థలం యింకా పన్నెండు కిలోమీటర్లుంది. భట్టు ధైర్యం చెబుతూనే వున్నాడు నాకు. కాస్త నెప్పి తగ్గిం తర్వాత చిన్నగా సైకిళ్లు నడిపిస్తూ ఓ రెండు కిలోమీటర్లు వెళ్లాం. మనసుకు ఊరట కలిగిస్తూ దీపాలు మెరుస్తూ కనిపించాయి.

కన్నడ రాజ్యంలో వాళ్లవాళ్ల పోలాల్లో, తోటల్లో ఇళ్లు కట్టుకుంటారు. దీపాలు మెరుస్తూ కనబడ్డది ఓ డాక్టర్గారిల్లు. ఆయన ధర్మస్థలలో వైద్యం చేస్తాడట. విశాలమైన పెరడుంది. టైం తొమ్మిదైంది. ఇక ఆ రాత్రి సైకిళ్లు ఆ కీకారణ్యంలో నడపడం సాధ్యంకాని పని. వెళ్లి ఆ డాక్టరుగారిని రాత్రికి వరండాలో పడుకోనివ్వమని కోరాం.

ఆయన వెంటనే వీల్లేదు, వీల్లేదు... సారీ వెళ్లండి అనేసాడు. ఏం చేయడం రోడ్డుమీద వానకి తడుస్తూ నించున్నాం, నేను భట్టూ. (ఆ డాక్టర్ని తిట్టుకుంటూనే లెండి.) ఇంతలో ఓ మినీ బస్సు మమ్మల్ని దాటి వెళ్లింది. కొద్ది దూరం వెళ్లి మళ్లీ రివర్సులో మా దగ్గరికొచ్చి ఆగింది.

కండక్టరు తలబైటికి పెట్టి 'ఏమిటి కథ' అనడిగాడు. చెప్పాం. అతను కిందికి దిగి మా సైకిళ్లని నానా తంటాలూ పడి ఎక్కించి... మమ్మల్ని ఎక్కమని మా దగ్గర నయాపైసా తీసుకోకుండా మమ్మల్ని ధర్మస్థల చేర్చాడు. చూడండి. పనసతొనలు పెట్టిన కూలీలూ... మినీబస్సు కండక్టరూ మాకు చాలా మంచివాళ్లు. ఆ డాక్టరు మాత్రం చెడ్డవాడు. సహాయనిరాకరణకు ఆయన కారణాలు ఆయనకుండొచ్చు కదా.

అంతేనండీ మంచీ చెడూ కొలతలు – ఇట్లాగే వుంటాయి. ●